సాక్షి సంగారెడ్డి
గురువారం, 13 జూలై 2023



అయ్యో బిడ్డా.. ఎంత పనిచేశావు..

దేవుడా మేమెట్లా బ్రతకాలి..అయ్యో బిడ్డా..ఎంత పనిచేశావు..అంటూ గుండెలు బాదుకుంటూ తల్లిదండ్రులు తమ పిల్లలపై పడి రోదిస్తున్న ఘటన కంటతడి పెట్టించాయి. 8లో



ఆర్డీఓ కార్యాలయం ముట్టడి

పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ నాయకులతో కలిసి ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. 9లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 14 మందికి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 12 మందికి చేసినట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నామని మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండల పరిధిలోని బచ్చుగూడెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం అమరేందర్ రెడ్డి మెడ్వాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు మెడ్వాన్ సంస్థ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ రత్నం, చైల్డ్ లైన్ కో–ఆర్డినేటర్ మహజీబ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. బుధవారం పశుసంవర్ధక శాఖ, డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించిన ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల్లో గొర్రెల యూనిట్ల రెండో విడత పంపిణీ కార్యక్రమం మొదలైందని, ఇప్పటికే నియోజకవర్గాలవారీగా పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. మొత్తం 10,331 సభ్యులుగాను 4,767 మంది తమ వాటా చెల్లించారన్నారు. వారికి విడతలవారీగా పంపిణీకి ఏర్పాట్లుచేయాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పనుల వివరాలపై నివేదిక అందజేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. సమీక్షలో పశుసంవర్ధక శాఖ అధికారిణి వసంత కుమారి, ఏడీ ప్రభాకర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మిషన్ భగీరథ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ కోచింగ్ ప్రవేశ పరీక్ష

సంగారెడ్డి టౌన్: సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ కోచింగ్ ప్రవేశ పరీక్ష ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్ బుధవారం తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను www. studycircle. cgg. gov. in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లా వారికి బీవీరాజ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నర్సాపూర్‌లో ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. వివరాలకు 08455 277 015 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

కేవీకేను సందర్శించిన వైస్ చాన్స్‌లర్



వర్మీకంపోస్టు తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్న వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నీరజ

జహీరాబాద్: మండలంలోని దిడిగి గ్రామ శివారులోగల డీడీఎస్–కేవీకే కేంద్రాన్ని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నీరజ ప్రభాకర్ బుధవారం సందర్శించారు. కేంద్రం కార్యకలాపాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందిస్తున్న శిక్షణ, వర్మీ కంపోస్టు తయారీ, భూసార పరీక్షల నిర్వహణ, పలు రంగాల్లో రైతులు, ప్రజలకు ఇస్తున్న శిక్షణ వివరాలు తెలుసుకున్నారు. సేంద్రియ వ్యవసాయం చేసేందుకు రైతులను ఏ మేరకు ప్రోత్సహిస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. కేవీకేలో చేపడుతున్న కార్యకలాపాల గురించి శాస్త్రవేత్త ఎస్.స్నేహలత వివరించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ డీన్ కిరణ్‌కుమార్, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంపై అవగాహన ఉండాలి

సంగారెడ్డి టౌన్: ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలని డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఈవీఎం ద్వారా ఓటువేసే విధానాన్ని పరిశీలించారు. సిబ్బందిని అడిగి మిషన్ పనితీరు తెలుసుకున్నారు. ఆయన వెంట బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.

సిబ్బందిలేక..సేవలందక



సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులకు వెల్‌నెస్ సెంటర్లో వైద్యసేవలు అందడం లేదు. సెంటర్‌లో మొత్తం ముగ్గురు వైద్యులు ఉండాల్సిఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. దీంతో రోగులకు వైద్య సేవలు అందడంలేదు. అంతేకాకుండ విధుల్లోఉన్న డాక్టర్స్‌పై భారం పడటమే కాకుండా రోగులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ముగ్గురు ఫార్మాసిస్ట్‌లకు ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారు. ఇద్దరిలో ఒకరు సెలవుపై వెళ్లారు. నిత్యం వస్తున్న రోగులకు మందుల పంపిణీలో జాప్యం జరుగుతుండటంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- రోగులకు అందని వెల్‌నెస్ సేవలు
- వెనుదిరిగి వెళ్తున్న వైనం
- వేధిస్తున్న మందుల కొరత
- చర్యలు చేపట్టాలని వినతి

వృథాగా రెండు శాఖలు

☛ ఫిజియోథెరపీ విభాగంలో వైద్యుడు అందుబాటులో ఉండటంలేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఉన్నవారికి పని ఉండకపోవడంతో ఆ విభాగం ఖాళీగానే కనిపిస్తుంది.

☛ వైద్యం కోసం వెళ్లినవారికి మిషన్లు పనిచేయడం లేదని సమాధానం ఇస్తున్నారు. అలాగే డెంటల్ విభాగం ఉన్నా ఇప్పటి వరకు రోగులకు వైద్యసేవలు అందించిన దాఖాలులేవని వైద్యం కోసం వచ్చిన వారు తెలిపారు. ఈ విభాగంలోనూ తగిన పరికరాలు లేవు, ఉన్నవి పాడయ్యాయి.

☛ దీంతో దంత వైద్యం కోసం రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. అక్కడ హెల్త్ కార్డులు పనిచేయడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

వైద్యం అందక ..

☛ అనారోగ్యంతో వచ్చే రోగులకు కొద్దిపాటి వైద్యసేవలు కూడా అందడంలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఇష్టారాజ్యంగా విధుల నిర్వహణ

- వెల్ నెస్ సెంటర్లో పనిచేసే ఫిజియోథెరపీ, డెంటల్ విభాగం సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- వైద్యం కోసం వచ్చిన రోగులను పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు. సాధారణ వైద్యం కోసం రోగులు అధిక సంఖ్యలో వస్తారని, దీర్ఘ కాల వ్యాధులకు వైద్యం చేయించుకునేవారు ఒకరిద్దరు మాత్రమే వస్తారని వారిని పట్టించుకోరని స్థానికులు చెబుతున్నారు.
- వెల్‌నెస్ సెంటర్‌లో వైద్యసేవలు అందేలా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిమ్జ్ రోడ్డు పనులు పూర్తి చేయాలి

- టీఎస్ఐఐసీ ఎండీ వెంకట నర్సింహారెడ్డి



రోడ్డు మ్యాపును పరిశీలిస్తున్న టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటవుతున్న నిమ్జ్ మౌలిక వసతుల్లో భాగంగా చేపట్టిన రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని టీఎస్ఐఐసీ ఎండీ వెంకట నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. మ్యాపులో రోడ్డు వివరాలను పరిశీలించారు. జహీరాబాద్ పరిధిలోని రంజోల్ నుంచి ఝరాసంగం మండల పరిధిలోని నిమ్జ్ వరకు 9.5 కిలో మీటర్ల మేర వంద అడుగుల వెడల్పుతో సుమారు రూ.90 కోట్ల నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు పనులు మరింత వేగవంతం చేయాలని, అవసరం ఉన్న చోట కల్వర్టులు నిర్మించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు రోడ్డు పనులు పర్యవేక్షించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్డీఓ వెంకారెడ్డి, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజరు అనురాధ, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే భిక్షపతి, తహసీల్దార్ రాజిరెడ్డి, సర్వేయర్లు నర్సింలు, లాల్‌సింగ్, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ప్రభుత్వ వైద్యసేవలు మరింత చేరువ

- నియోజకవర్గానికి 15 పీహెచ్‌సీలు మంజూరు
- రూ.3 కోట్లు విడుదల

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రజల అవసరాల కోసం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నియోజకవర్గానికి ఒకేసారి 15 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకవైపు పారిశ్రామిక రంగం, మరోవైపు రియల్ ఎస్టేట్ రంగంలో పటాన్‌చెరు నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నేపథ్యంలో నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఇటీవల మంత్రి హరీశ్‌రావుకు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. విజ్ఞప్తి చేసిన మూడు రోజుల్లోనే నియోజకవర్గ పరిధిలోని అమీన్పూర్, బీరంగూడ, గుమ్మడిదల ఏ, గుమ్మడిదల బి, అన్నారం, దాచారం, లకడారం, ముత్తంగి, రుద్రారం, నల్తూరు, శివానగర్, భానురు, బొల్లారం, జిన్నారం, దోమడుగులలో ఉప కేంద్రాలు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ఒక్కో ఉపకేంద్ర నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున రూ.3 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గ ప్రజల కోసం రూ.300 కోట్లతో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. దీంతోపాటు పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయని తెలిపారు. వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ముగిసిన స్పోర్ట్స్ పాఠశాల అర్హత పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ పాఠశాల అర్హత పోటీలు ముగిశాయి. బుధవారం డీవైఎస్ఓ రామచంద్రరావు, సూపరింటెండెంట్ జావిద్ ఆలీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట ఆదేశాల మేరకు 5వ తరగతి ప్రవేశ ఎంపిక పోటీలు నిర్వహించారు. 70 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. పోటీల్లో ఎంపికైన విద్యార్థి వివరాలు తల్లిదండ్రుల మొబైల్‌కు పంపుతామని అధికారులు తెలిపారు. జిల్లాస్థాయి పోటీలో ఎంపికైన వారిని రాష్ట్ర పోటీలను ఈనెల 29న హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహిస్తారన్నారు. పోటీలను వ్యాయామ ఉపాధ్యాయ జిల్లా కార్యదర్శి కిష్టయ్య, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు షరీపుద్దీన్, గౌసుద్దీన్, రామాగౌడ్ తదితరులు పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారానికి టీపీయూఎస్ కృషి



మిర్జాపూర్‌లో సభ్యత్వ నమోదు రశీదు అందజేస్తున్న నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు టీపీయూఎస్ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మిర్జాపూర్(బి), చీకూర్తి, హద్నూర్, మల్గి తదితర పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయనుకున్నా, అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడిచినా పరిష్కారం కావడం లేదన్నారు. బదిలీలు, ప్రమోషన్లతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఎన్ని మార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమయ్యే వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను పర్మనెంట్ చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సాయిలు



సమ్మెలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతి ఉద్యోగ, కార్మికులను వెంటనే పర్మనెంట్ చేసి, వారి వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో సమ్మె చేస్తున్న పంచాయతీ ఉద్యోగ, కార్మికులకు మద్దతు తెలిపారు. అంతకు ముందు ఉద్యోగ, కార్మికులు మండల పరిషత్ కార్యాలయం నుంచి ఝరాసంగం ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. 11వ పీఆర్సీ ప్రకారం రూ.19 వేలు వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మహిపాల్, ఉద్యోగ, కార్మికులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ సంపూర్ణం



బంద్‌లో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. బుధవారం విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఉమెన్స్ జూనియర్ కాలేజీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడారు. ముఖ్యమంత్రి విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా, పక్క రాష్ట్రంలో తిరగడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దందా కొనసాగుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల గడుస్తున్నా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు. నాలుగేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల రూ.5,177 కోట్లు పెండింగులో ఉన్నాయని, వాటిని విడుదల చేయడం లేదన్నారు. టీచర్, లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలని, డీఎస్సీ ప్రకటించాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పిల్లలకు వైద్యపరీక్షలు



వైద్యశిబిరానికి వచ్చిన పిల్లలతో డాక్టర్లు

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డిలోని బాల సదనంలో జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ఆధ్వర్యంలో బుదవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పలువురు పిల్లలకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డెంటల్ మె డికల్ ఆఫీసర్ సమీన తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ భగ్గు



రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నాయకులు



సదాశివపేటలో రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ అనవసరం అంటూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు బుధవారం మండలంలోని ఇస్నాపూర్ చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి వెన్నుముక వ్యవసాయ రంగంపై పీసీసీ అధ్యక్షుడు అహంకారతపూరితంగా వ్యాఖ్యలు చేయడం ఆ పార్టీ దిగజారుడుతనాన్ని సూచిస్తుందన్నారు. వ్యవసాయ రంగంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న విప్లవాత్మక సంస్కరణల కారణంగా ధాన్యం దిగుబడి భారీగా పెరిగిందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కొనలేక విలువలు లేని రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పాండు, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేశ్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, యాదగిరి యాదవ్, ముత్తంగి సర్పంచ్ ఉపేందర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌పై మాట్లాడే నైతిక హక్కు లేదు

సదాశివపేట(సంగారెడ్డి): వ్యవసాయ రంగానికి అందిస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్‌పై మాట్లాడే నైతిక హక్కు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. ఉచిత విద్యుత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బుధవారం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మలను దహనం చేశారు. రైతుల అభివృద్ధిని ఓర్వలేకనే రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగానికి 3 గంటల ఉచిత విద్యుత్ సరఫరా సరిపోతుందని అనడం ఎంత వరకు సమంజసమని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, ఎంపీపీలు మనోజ్ రెడ్డి, యాదమ్మ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు విజయ భాస్కర్ రెడ్డి, సొసైటీ చైర్మన్లు పవన్ కుమార్, రాజు, రైతుబంధు అధ్యక్షుడు మల్లేశం, మండల అధ్యక్షుడు విఠల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రైతాంగంపై కక్షగట్టిన కాంగ్రెస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: తెలంగాణ రాష్ట్ర రైతాంగంపై కాంగ్రెస్ పార్టీ కక్షకట్టిందని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు విమర్శించారు. బుధవారం మొగుడంపల్లి మండలం ధనాసిరి క్రాస్‌రోడ్డులో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులకు ద్రోహం చేసిందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఢిల్లీ వసంత్, ఆత్మ చైర్మన్ ఎస్.పెంటారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గేదెను ఢీకొన్న గూడ్స్ రైలు



గూడ్స్ రైలు కింద గేదె కళేబరం

తూప్రాన్: గేదెను గూడ్స్ రైలు ఢీకొన్న ఘటనలో గేదె మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి..నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న గూడ్స్ రైలు తూప్రాన్ మండలం నాగులపల్లి రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతున్న గేదెను ఢీకొట్టింది. ఈ ఘటనలో గేదె రైలు చక్రాల కింద ఇరుక్కొని మృతి చెందింది. దీన్ని గమనించిన రైలు డ్రైవర్ రైలును నిలిపివేసి స్థానికుల సహాయంతో గంటపాటు శ్రమించి గేదెను పక్కకు లాగారు. అనంతరం గూడ్స్ రైలు సికింద్రాబాద్‌కు వెళ్లింది.

మాజీ ఎంపీటీసీపై అట్రాసిటీ కేసు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ మాజీ ఎంపీటీసీ గొర్ల వీరన్నపై ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ) కేసు నమోదయినట్లు ఎస్‌ఐ మహేశ్ బుధవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఎస్సీ మహిళ అకునూరి దీనక్యాతరిన్ కుటుంబానికి సంబంధించిన భూమిని అక్రమంగా పట్టా చేసుకోవడం, అప్పు తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వాలని కోరినందుకు కులం పేరుతో దూషించాడని, కొట్టాడని ఆరోపిస్తూ మే18న మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై పోలీసులు విచారణనంతరం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

మనోహరాబాద్(తూప్రాన్): విద్యుత్ మరమ్మత్తులు చేపట్టిన వారి పనులను అడ్డగించడమే కాకుండా వారిపై దాడి చేసిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మనోహరాబాద్ మండలం రంగాయపల్లి శివారులో గజ్వేల్ విద్యుత్ ఏడీఈ దాసరి నర్సయ్య ఆధ్వర్యంలో విద్యుత్ మరమ్మత్తు పనులను చేట్టారు. అందులో భాగంగా 133 కేవీ లైన్ కింద ఉన్న చెట్లు, పొదలను సిబ్బందిచేత నరికి వేయిస్తున్నారు. ఈ క్రమంలో రంగాయపల్లి గ్రామానికి చెందిన కర్రె చిన్న స్వామి, శ్రీశైలం, కనకయ్యలు విద్యుత్ సిబ్బంది వద్దకు వచ్చి తమకు చెందిన మామిడి చెట్టును ఎందుకు కొట్టి వేయించారని దూషించడమే కాకుండా, సిబ్బందిపై, ఏడీఈపై దాడి చేశారు. దీంతో ఏడీఈ నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అనారోగ్యంతో కార్మికుడి మృతి



మృతుడు పవన్‌కుమార్

జిన్నారం(పటాన్ చెరు): పరిశ్రమలో విధులు నిర్వహించి బయటకు వస్తున్న సమయంలో ఛాతి నొప్పితో ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన జిన్నారం మండలంలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ నయిముద్దీన్ కథనం ప్రకారం.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం కాగువడా గ్రామానికి చెందిన బల్ల పవన్ కుమార్(25) గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని హెటిరో పరిశ్రమలో కెమిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో అతనికి ఛాతిలో తీవ్రమైన నొప్పి రావడంతో అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించేక్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్ఐ ఐలయ్యకు మెమో జారీ

మద్దూరు(హుస్నాబాద్): రిజిస్ట్రేషన్ పనుల్లో తప్పుడు సమాచారంతో ఇబ్బందులకు గురిచేసిన ఆర్ఐ ఐలయ్యపై మెమో జారీ చేసినట్లు తహసీల్దార్ గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ భూమిని అక్రమంగా వేరొకరికి పట్టా మార్పిడికి పాల్పడినందునా రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని జాలపల్లికి చెందిన వెతుకు గోపాల్‌రెడ్డి ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం ఆర్ఐపై మెమో జారీ చేశామని తహసీల్దార్ పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788601]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అయ్యో బిడ్డా.. ఎంత పనిచేశావు

- ప్రేమజంట ఆత్మహత్యతో తీవ్ర విషాదం
- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు
- శోకసంద్రంలో రెండు కుటుంబాలు
- కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు



భగీరథ్ అంత్యక్రియల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



లచ్చపేటలో భగీరథ్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, బంధువులు

దుబ్బాకటౌన్: దేవుడా మేమెట్లా బ్రతకాలి..అయ్యో బిడ్డా..ఎంత పనిచేశావు..అంటూ గుండెలు బాదుకుంటూ తల్లిదండ్రులు తమ పిల్లలపై పడి రోదిస్తున్న ఘటన ప్రతీ ఒక్కరిని కంటతడి పెట్టించాయి. తన బిడ్డ మృతదేహాన్ని చూసిన నేహా తల్లి ఆసుపత్రి మార్చురి వద్ద స్పృహ తప్పింది. భగీరథ్ తల్లి సైతం విగత జీవిగా మారింది. తన కొడుకును చూసి గుండెలు బాదుకుంటూ రోదించడం అక్కడున్న వారిని కలచివేసింది. ఆసుపత్రితో పాటు వారి ఇండ్లలో కుటుంబీకులు, బంధువుల రోదనలతో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

లచ్చపేట, దుబ్బాకలో తీవ్ర విషాదం..

ప్రేమజంట భగీరథ్(17), నేహా(16) బుధవారం తెల్లవారుజామున లచ్చపేటలోని ప్రియడి ఇంట్లో ఒకే దులానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారనే సంఘటనతో దుబ్బాక, లచ్చపేటలో తీవ్ర విషాదం అలుముకుంది. ఉదయంనుంచి సాయంత్రం వరకూ ఎవరిని కదిలించినా ఈ సంఘటనను తలుచుకుంటూ కంట తడిపెట్టడమే కనిపించింది. దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో మైనర్ ప్రేమ జంటకు వైద్యులు పోస్టుమార్టమ్ నిర్వహించి వారి బంధువులకు మృత దేహాలను అప్పగించారు. ప్రేమ జంట బలవన్మరణానికి పాల్పడక ముందు రాసి ఉంచిన సూసైడ్ నోట్‌లో మా మృతదేహాలను ఒకే దగ్గర అంత్యక్రియలు నిర్వహించాలని రాసి ఉంచారు. ఇందుకు వారి వారి కుటుంబాల వారు ఒప్పుకోకపోవడంతో ఎస్‌ఐ మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు భగీరథ్, నేహా మృత దేహాలను వేర్వేరుగా వారి బంధువులతో కలిసి అంత్యక్రియలకు తరలించారు. భగీరథ్ మృతదేహానికి లచ్చపేటలో, నేహా మృతదేహానికి దుబ్బాకలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఇరువురి అంత్యక్రియల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు..

మైనర్ ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడ సంఘటనను తెలుసుకున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావులు వారి కుటుంబాలను పరామర్శించారు. ఎంపీ, ఎమ్మెల్యే భగీరథ్, నేహా అంత్యక్రియల్లో పాల్గొని ఇరు కుటుంబాలను ఓదార్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డితో పాటు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, పెద్ద ఎత్తున హాజరయ్యారు.



నేహా కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రైతుల ఖాతాల ఫ్రీజ్ తీసేస్తాం

- ప్రభుత్వ సాయం డబ్బులు చెల్లిస్తాం
- సాక్షి కథనానికి స్పందించిన ఎమ్మెల్యే, ఆర్డీఓ, వ్యవసాయాధికారులు

సాక్షి ఎఫెక్ట్..

వట్‌పల్లి(అందోల్): పంట రుణాలను రెన్యూవల్ చేసుకోనందున బ్యాంకర్లు రైతుల ఖాతాలను ఫ్రీజ్ చేశారు. ప్రభుత్వం పంట పెట్టుబడికి రైతులకు అందజేస్తున్న రైతుబంధు, ఆసరా పెన్షన్లు, కల్యాణలక్ష్మీ డబ్బులను ఇవ్వకపోవడంపై మంగళవారం రైతుల ఖాతాలు ఫ్రీజ్ అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచూరితమైంది. దీంతో జిల్లా వ్యవసాయాధికారులు, ఆర్డీఓ, ఎమ్మెల్యే క్రాంతికిరణ్ స్పందించారు. బుధవారం వట్‌పల్లిలోని ఏపీజీవీబీకి చేరుకొని రైతుల ఖాతాలను ఎందుకు హోల్డ్‌లో పెట్టారని బ్యాంకు మేనేజర్ జనార్ధన్‌ను ప్రశ్నించగా, తాము రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెట్టలేదని బదులిచ్చారు.

మంగళవారం సాక్షిలో కథనం వచ్చిందనే విషయాన్ని బ్యాంకర్ల దృష్టికి ఎమ్మెల్యే తీసుకొచ్చారు. అక్కడున్న ఓ మహిళ రైతు బ్యాంకు ఖాతాను మేనేజర్‌తో పరిశీలింపజేయగా హోల్డ్‌లో ఉన్నట్లు రుజువైంది. ఈ విషయంలో సదరు బ్యాంకు మేనేజర్ తెల్లమొహం పెట్టుకోవలిసిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఆ తప్పును ఫీల్డ్ ఆఫీసర్‌పై రుద్దే యత్నం చేశాడు. అధికారులు బ్యాంకుకు వచ్చారనే విషయం తెలుసుకున్న బాధిత రైతులు కూడా బ్యాంకుకు చేరుకొని తమ గోడు చెప్పుకున్నారు. ప్రభుత్వ పథకాలను పంట రుణాల వడ్డీ పేరిట ఆపేస్తున్నారని వారి దృష్టికి తెచ్చారు. కలెక్టర్ సర్క్యులర్ కాపీని వ్యవసాయాధికారులు ఏడీఏ శివకుమార్, ఏఓ మహేష్‌చౌహాన్ బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ బ్యాంకు అధికారులతో రైతుబంధును ఎలా ఆపుతారని మేనేజర్‌ను నిలదీశారు. ఎట్టి పరిస్థితుల్లో ఆపొద్దని, ఇప్పటికే రూ.50వేల వరకు పంటరుణం మాఫీ చేసిందని, త్వరలో రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామన్నారు. వెంటనే రైతులకు పంట పెట్టుబడితో పాటు ఇతర ప్రభుత్వ పథకాల డబ్బులు అందించాలని ఆదేశించారు.



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ఆర్డీఓ, వ్యవసాయాధికారులు

సాక్షి కథనంపై ఎమ్మెల్యే ప్రశంసా..

రైతుల ఖాతాలు ఫ్రీజ్ కథనం ప్రచూరించినందుకు ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సాక్షిని ప్రశంసించారు. బ్యాంకు అధికారులు రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెట్టి రైతుబంధు సహాయాన్ని నిలిపివేసినట్లు అప్పటి వరకు తన దృష్టికి రాలేదన్నారు. ఉదయం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనం చూసి విషయం తెలుసుకున్నానన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి ప్యాకెట్లను చూపుతున్న ఎస్పీ చక్రవర్తి, సీఐ లాలూ నాయక్



నర్సాపూర్: పోలీసుల అదుపులో నిందితుడు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా గంజాయి పండిస్తూ విక్రయించేందుకు రవాణా చేస్తున్న అంతరాష్ట్ర ముఠాను తెలంగాణ యాంటి నార్కొటిక్ బ్యూరో-పోలీసులు సంయుక్తంగా ప్రణాళికతో పట్టుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఎస్పీ చక్రవర్తి, పటాన్‌చెరు సీఐ లాలు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన రాజారావు, అతని బంధువు బాబ్జీతో కలిసి తమ సొంత భూమిలో గంజాయి పండించి వాటిని చిన్న చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసేవారు. ఒక కారు అంతర్భాగంలో సెల్ఫ్‌లు ఏర్పాటు చేసుకుని తనిఖీల్లో దొరకకుండా అందులో గంజాయి దాచి రవాణా చేసేందుకు అనువుగా కారును ఏర్పాటుచేసుకున్నారు. వీరికి పరిచయమైన ర్పుగోదావరి జిల్లా రావులపాలెంకు చెందిన శివ సాయికుమార్ సంగారెడ్డి జిల్లా నాగలగిద్ద మండలం శంకరాయ తండాకు చెందిన రాథోడ్ వెంకట్‌కు విక్రయించేవారు. ఇలా ఈ నెలలో మూడుసార్లు అతనికి విక్రయించేందుకు రవాణా కూడా చేశారు. ఈ క్రమంలో తెలంగాణ యాంటి నార్కొటిక్ బ్యూరో-పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓఆర్ఆర్ వద్ద అంతరాష్ట్ర ముఠాను మంగళవారం రాత్రి పట్టుకొని వారి వద్దనుంచి 90 కిలోల గంజాయి, కారు, పట్టుబడిన రాజారావు, బాబ్జీ, శివ కుమార్, రాథోడ్ వెంకట్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు ప్రాసాద్‌ఐలు రామనాయుడు, ప్రసాద్ రావు సిబ్బంది తదితరులు తరలించారు.

నర్సాపూర్‌లో ఎండు గంజాయి..

నర్సాపూర్: నర్సాపూర్‌లో బుధవారం ఎండు గంజాయిని పట్టుకున్నామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..నర్సాపూర్ పట్టణంలోని విఘ్నేశ్వర కాలనీలో నివాసం ఉండే మహ్మద్ సమీరోద్దీన్ ఎండు గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు అతని ఇంట్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో రెండు కిలోల 35 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. నిందితుడు హైదరాబాద్‌లోని జియాగూడ నుంచి రూ.14వేలకు కిలో గంజాయి తెచ్చేవాడని విచారణలో ఒప్పుకున్నాడు. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్ తెలిపారు. ఈ తనిఖీలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ నరేందర్, సిబ్బంది చంద్రయ్య, ఎల్లయ్య, రాజు, నవీన్, యశోద, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇండ్లలో చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): తాళం వేసిన ఇండ్లలో చోరీ జరిగింది. ఈ సంఘటన మండల పరిధి గూడూర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కావేటి లక్ష్మీ మంగళవారం ఇంటికి తాళం వేసి రావెల్లి గ్రామంలో ఉంటున్న తన కూతురు ఇంటికి వెళ్లింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి అల్మారాలోని అరతులం బంగారు పుస్తె, 40 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఇదే గ్రామంలోని పట్నం మహేందర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి ఉండడంతో తాళం పగులకొట్టి రూ.5వేల నగదు ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



బీరువాలో చిందర వందరగా పడేసిన వస్తువులు

సీఎన్‌జీ ఆటో చోరీకి యత్నం

శివ్వంపేట(నర్సాపూర్): ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటోని గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన గంగన్నగారి బాబు ఆటో నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. రోజువారిగానే తన సీఎన్‌జీ ఆటోని ఇంటి ముందు పార్క్ చేసి ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసేందుకు ప్రయత్నించగా స్టార్ట్ కాలేదు. ఆటోని గ్రామ శివారులోకి తోసుకుంటూ తీసుకెళ్లారు. డ్రైవర్ సీటును ధ్వంసం చేశారు. కింది భాగంలో ఉన్న బ్యాటరీతో పాటు రెండు టైర్లను ఎత్తుకెళ్లారు. చోరీ విలువ రూ.15వేలు ఉంటుందని బాధితుడు బాబు తెలిపారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.



ఆటో నుంచి బ్యాటరీ తీస్తున్న దృశ్యం

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య



మద్దుల కిష్టారెడ్డి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌కు చెందిన మద్దుల కిష్టారెడ్డి (52) వ్యవసాయం చేసుకుంటూ భార్య విజయలక్ష్మి, కొడుకు మనీష్‌రెడ్డి, కూతురు మనుశ్రీ లను పోషించుకుంటున్నాడు. కాగా రెండు సంవత్సరాల క్రితం కొడుకు మనీష్ రెడ్డి గ్రామంలో ఈతకు వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. కొడుకు మరణంతో మనోవేదనకు గురైన కిష్టారెడ్డి ప్రతీ రోజు కొడుకును గుర్తుకు తెచ్చుకునే వాడు. ఈ క్రమంలో కొడుకు మరణాన్ని తట్టుకోలేక కిష్టారెడ్డి మంగళవారం రాత్రి రుద్రారం శివారులోని తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి అక్కడ ఉన్న గదిలో కిష్టారెడ్డి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటినుంచి వెళ్లిన కిష్టారెడ్డి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అన్ని చోట్ల వెతుకుతున్న క్రమంలో వ్యవసాయ పొలం వద్ద ఉరి వేసుకుని కనిపించాడు. మృతుని భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నారాయణఖేడ్‌లో వివాహిత..

పటాన్‌చెరు టౌన్: వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..నారాయణఖేడ్‌కు చెందిన సాయిలు బతుకుదెరువు కోసం 20 సంవత్సరాల క్రితం పటాన్‌చెరు మండలం చిట్కుల్‌కు వచ్చి కూలీ పనులుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా పెద్ద కూతురు మౌనిక(23)కు సంవత్సరం క్రితం కంగ్టి మండలం రామతీర్థంకు చెందిన జైపాల్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు తరచూ జరుగుతుండడంతో మౌనిక రెండు నెలల క్రితం చిట్కుల్‌లోని తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. బుధవారం తల్లిదండ్రులు కూలీ పనికి, చెల్లెలు స్కూల్‌కి వెళ్లగా ఇంట్లో ఎవరూలేని సమయంలో మౌనిక సీలింగ్ రాడ్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

లారీ దిగబడడంతో తప్పిన ప్రమాదం

చేర్యాల(సిద్దిపేట): దుద్దెడ-జనగామ జాతీయ రహదారిపై తాడూరు క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం ఉదయం లోడుతో జనగామ వైపు వెళుతున్న లారీ దిగబడింది. దీంతో పెను ప్రమాదమే తప్పిందని స్థానికులు వాపోయారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తాత్కాలిక మరమ్మత్తు పనులు చేశారు. అక్కడ మట్టి పోశారు. ఈ మట్టి గట్టిపడకుండానే ఆ రోడ్డు గుండా లారీ లోడుతో వెళ్తున్న క్రమంలో భూమిలోకి దిగబడింది. డైవర్షన్ ఇరుకుగా ఉండడంతో పక్క నుంచి వాహనాలు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆ దారి గుండా ట్రాఫిక్ నిలిచిపోయింది. ద్విచక్రవాహనాలు, కార్లు మాత్రమే ఆ వైపుగా వెళ్లాయి. జనగామ సిద్దిపేట మధ్యలో నడిచే ఆర్టీసీ బస్సులు కొన్ని రద్దు కాగా మరి కొన్ని కొమురవెల్లి, చేర్యాల మీదుగా వెళ్లాయి. ఆ వైపుగా వచ్చిన లారీలు మాత్రమే అక్కడే నిలిచిపోయాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై పోసిన మట్టిని గట్టిపడే విధంగా చదును చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డులో దిగబడిన లారీ

ట్రాక్టర్, ఎక్సెల్ ఢీ.. ఇద్దరికి గాయాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ట్రాక్టర్, ఎక్సెల్ ఢీకొన్న సంఘటనలో తండ్రి, కూతురికి గాయాలయ్యాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం కొల్చారం మండలం రంగంపేట నుంచి జోగిపేట వైపు శేరిపల్లి గంగరాం తన కూతరితో ఎక్సెల్‌పై వస్తున్నాడు. చిట్కుల్ పెట్రోల్ పంపు నుంచి గ్రామానికి చెందిన సుధాకర్ ట్రాక్టర్‌పై వస్తున్నాడు. దీంతో ఇరువురు చిలప్‌చెడ్ మండలంలోని చిట్కుల్ శివారులో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గంగరాం, అతడి కూతురికి కాళ్లు విరిగాయి. వారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున ముత్తంగి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సంబంధికులు ఎవరైనా ఉంటే పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

సంగారెడ్డి మున్సిపాలిటీ: రోగి పరిస్థితి బాగా లేదని సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రి ఎదుట బంధువులు ఆందోళన చేశారు. వారం క్రితం డెలివరీ కోసం ఝరాసంఘం మండలం కంభాలపల్లి నుంచి శరీనా డెలివరీ కోసం వచ్చింది. దీంతో ఇక్కడ డెలివరీ చేసే క్రమంలో శిశువు మృతి చెందింది. దీంతో తల్లి పరిస్థితి విషమంగా ఉండడంతో సిటీలోని ఓ ప్రైవేటు ఆ సుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ తల్లి పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డిలోని ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. పోలీసుల జోక్యంతో ఆందోళన కారులను సముదాయించారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): ఇంటి నుంచి ఆడుకుంటూ బయటకు వెళ్లిన ఓ చిన్నారి తప్పిపోయిన ఘటన జిన్నారం మండలంలోని బొల్లారంలో బుధవారం జరిగింది. బొల్లారం మున్సిపల్ పరిధిలోని గాంధీ నగర్‌కు చెందిన ఐదేళ్ల శ్రీహర్షిణి ఇంటి ముందు ఆడుకుంటూ బయటకు వెళ్లింది. చిన్నారి కోసం తల్లిదండ్రులు రెండుగంటల పాటు వెతికారు. కాగా బీరప్పబస్తీలో ఓ చిన్నారిని చూసి స్థానికులు అంగన్‌వాడీ టీచర్లకు సమాచారం అందజేశారు. చిన్నారి తప్పిపోయిన విషయాన్ని ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీడీపీఓ చంద్రకళ విచారణ అనంతరం చిన్నారిని వారి తల్లిదండ్రులకు అప్పజెప్పారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన డ్రైవర్‌ను క్యాబిన్‌లో నుంచి బయటకు తీస్తున్న దృశ్యం



లారీని ఢీకొన్న మరో లారీ

జహీరాబాద్: నిలిచివున్న లారీని మరో లారీ ఢీకొన్న ఘటన పట్టణంలోని మహీంద్ర కర్మాగారం వద్ద 65వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి..జహీరాబాద్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..పశ్చిమ గోదావరి జిల్లా రావులపాలెం నుంచి ముంబాయి వెళుతున్న లారీ ఎదురుగా ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది. క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ జి.వెంకట సురేంద్ర, క్లీనర్ కనకరాజులు తీవ్రంగా గాయపడ్డారు. వారు అందులోనే ఇరుక్కుపోవడంతో ఎస్‌ఐ శ్రీకాంత్, సిబ్బంది గ్యాస్ కట్టర్ సహాయంతో వారిని అందులో నుంచి బయటకు తీశారు. అనంతరం వారిని జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం వారిని హైదరాబాద్‌క తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దళిత బంధులో అవకతవకలపై ఆగ్రహం



ఆందోళన చేస్తున్న దళితులు

పోలీసుల జోక్యంతో నిరసన విరమణ

వర్గల్(గజ్వేల్): దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం వర్గల్ మండలం నాచారంలో దళితులు రోడ్డెక్కారు. తూప్రాన్-గజ్వేల్ రహదారిపై నాచారం బస్టాండ్ వద్ద రోడ్డుకు అడ్డంగా బైఠాయించారు. ఆ మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభింపజేశారు. దళితబంధు పథకం కోసం అర్హులైన వారినే ఎంపిక చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. గౌరారం పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. ఫోన్ ద్వారా అధికారులను సంప్రదించి, అర్హులకే పథకం వర్తింపజేస్తామని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



రోడ్డుపై ధర్నాచేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ సూచించారు. గుమ్మడిదల గ్రామంలో బుధవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా ఓటు హక్కు వినియోగించటంపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఈవీఎం యంత్రం పనితీరును అందరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.
జహీరాబాద్ టౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని రెవెన్యూ అధికారులు సూచించారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నారాయణఖేడ్: మండలం లింగాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు సురేశ్ షెట్కార్ సమక్షంలో నారాయణఖేడ్‌లోని ఆయన స్వగృహంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహెర్ అలీ, నాయకులు సాయిలు, సాయిలుపటేల్, నెహ్రూనాయక్, చందర్‌నాయక్, గంగయ్యస్వామి, బక్షిరాం పాల్గొన్నారు.

బొల్లారం మున్సిపల్ కమిషనర్‌గా సంగారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ కమిషనర్‌గా సంగారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంగారెడ్డిని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, ఆర్వో శ్రీధర్, కౌన్సిలర్‌లు చంద్రారెడ్డి, హన్మంత్‌రెడ్డి, నిహారిక, గోపాలమ్మ సంగారెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. మెప్మా పీడీగా విధులు నిర్వహించిన సంగారెడ్డి బొల్లారం కమిషనర్‌గా బదిలీపై రాగా ప్రస్తుతం ఉన్న కమిషనర్ రాజేంద్రకుమార్ బదిలీపై హైదరాబాద్ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లారు. బదిలీపై వెళ్లిన కమిషనర్ రాజేంద్రకుమార్‌ను ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది సన్మానించి వీడ్కోలు పలికారు.


అభివృద్ధి పనులపై సమీక్ష

జహీరాబాద్: మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఎంపీపీ గిరిధర్‌రెడ్డి బుధవారం ఎంపీడీఓ సుమతి, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లోని పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనవసరంగా సైరన్ మోగించొద్దు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం అంబులెన్స్ డ్రైవర్‌లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్ మాట్లాడుతూ అంబులెన్స్‌లో రోగులు లేనప్పుడు సైరన్ వేయరాదన్నారు. అంబులెన్స్ డ్రైవర్‌లు ట్రాఫిక్ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: పట్టణ పరిధిలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని ఎంపీపీ గిరిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రైతులు, నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు కర్మాగారం యాజమాన్యం కార్మికులకు రూ.12కోట్ల మేర వేతన బకాయి పడిందన్నారు. దీంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కర్మాగారం యాజమాన్యం భూమిని అమ్మాలనే ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. లాకౌట్‌ను ఎత్తేసి కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలన్నారు. కర్మాగార యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామలింగారెడ్డి, రాములు, నాగిశెట్టిరాథోడ్, గుండ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై నిరసనలు

- రైతులకు క్షమాపణలు చెప్పాలని బీఆర్‌ఎస్ శ్రేణుల డిమాండ్
- పలుచోట్ల దిష్టిబొమ్మల దహనం


వట్‌పల్లి: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్


రామచంద్రాపురంలో..

సంగారెడ్డి మున్సిపాలిటీ: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులు చౌటకూరు మండలం కేంద్రంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు శివకుమార్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మాణిక్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.
కోహీర్(జహీరాబాద్): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మండలంలోని దిగ్వాల్ రైతువేదిక వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు నర్సింహులుయాదవ్, ఎంపీటీసీ బక్కారెడ్డి, సర్పంచులు సంగారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.
రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దప్పపాటిల్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.
జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంతో పాటు గుమ్మడిదల మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు రాజేశ్, నాయకులు పాల్గొన్నారు. గుమ్మడిదల గ్రామంలో చేపట్టిన రాస్తారోకోలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.
మునిపల్లి(అందోల్): బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు విజయ్‌కుమార్ అధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో సర్పంచ్‌లు వీరన్నపాటిల్, రమేశ్, ఎంపీటీసీలు శివకుమార్, నాగేశ్, మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్, యువత మండల అధ్యక్షుడు అనంద్ పాల్గొన్నారు.
న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు రాజ్‌కుమార్ అధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.
పుల్‌కల్(అందోల్): మండల కేంద్రంలో రైతుబంధు మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో ఎంపీటీసీ శ్రీనివాస్‌చారి, ప్యాక్స్ డైరెక్టర్ మహేష్‌బాబు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.
సంగారెడ్డి టౌన్ : ఉచిత విద్యుత్ వద్దంటే ఊరుకునేది లేదని సంగారెడ్డి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు చక్రపాణి ఆధ్వర్యంలో ఎంఎన్‌ఆర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మనోహర్‌గౌడ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని ఆయా గ్రామాల్లో ఆందోళనలు చేపట్టారు. ఝరాసంగంలో చేపట్టిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాచయ్యస్వామి, ప్రజాప్రతినిధులు జగదీశ్వర్, విజేందర్‌రెడ్డి, అమర్‌జిత్, నాయకులు పాల్గొన్నారు.
హత్నూర(సంగారెడ్డి): మండల శాఖ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తా రేవంరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా రాస్తారోకో నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.
మునిపల్లి(అందోల్): రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి సాయికుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉచిత విద్యుత్ సరఫరాను రద్దు చేయాలన్న ఆలోచన సరికాదన్నారు.
జహీరాబాద్ టౌన్: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళనలు చేపట్టారు. సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నారాయణ నాయకులు పాల్గొన్నారు.
రామచంద్రాపురం(పటాన్‌చెరు) తెల్లాపూర్ మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్ష్యులు దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.


సంగారెడ్డి మున్సిపాలిటీ: ధర్నా చేస్తున్న నాయకులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని సిర్గాపూర్‌లో చేపట్టిన నిరసనలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు పాల్గొన్నారు.
వట్‌పల్లి(అందోల్): ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో ఎమ్మెల్యే చంటిక్రాంతికిరణ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. వరము చైర్మెన్ వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్, డైరెక్టర్ బుద్దిరెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి శివాజీరావు, నాయకులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

నారాయణఖేడ్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో వామపక్ష విద్యార్థి సంఘాలు బుధవారం ఇచ్చిన పిలుపుమేరకు నారాయణఖేడ్‌లో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సెలవు ప్రకటించగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి సంఘాల నాయకులు బంద్ చేయించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి తెంకటి కుమార్, ఖేడ్ డివిజన్ కార్యదర్శి అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లులకు సన్మానం

హత్నూర (సంగారెడ్డి): గ్రామంలో ఆడపిల్లలను కన్న తల్లులకు ఆడపిల్ల పుడితే ఊరంతా పండగ అనే కార్యక్రమాన్ని మండలంలోని నస్తిపూర్ వెలుగు గ్రామైక్య సంఘం చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇటీవల ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లులకు గ్రామైక్య సంఘ భవనంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు మహమ్మద్ బేగం, నాయకులు మధు, సీసీ కల్పన, గ్రామ అభివృద్ధి కమిటీ కోశాధికారి మాధవి, వీవోఏ ప్రవీణ్, గ్రూపు లీడర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బాక్సింగ్‌లో శిక్షణ

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ మైనార్టీ బాలుర గురుకుల విద్యార్థులకు బాక్సింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. జాతీయ బాక్సర్, మాజీ ఆర్మీ మేజర్ మాజీద్ విద్యార్థులకు బాక్సింగ్ మెళకువలను నేర్పిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీద్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కనీస వేతనాలు అమలు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

జహీరాబాద్ టౌన్: కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మహీంద్ర అండ్ మహీంద్ర, రాక్‌వూల్, పిరామిల్ పరిశ్రమల కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం రూ. 26 వేల ఇవ్వాలన్నారు. 10 సంవత్సరాలుగా కనీస వేతనం జీవోను సవరించడంలేదన్నారు. ప్రభుత్వాలు స్పందించి పెండింగ్‌లో ఉన్న జీవోను సవరించి కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నారాయణ, బాబు, బాల్‌రాజ్, శ్రీధర్, విజయ్, గోపాల్, కృష్ణ పాల్గొన్నారు.

రైతులను రెచ్చగొట్టడం హేయమైన చర్య

- కాంగ్రెస్ శ్రేణుల మండిపాటు
- సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం

జిన్నారం(పటాన్‌చెరు): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఉచిత విద్యుత్ అమలు విషయంలో చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించారని, ప్రజల దృష్టిని మరల్చేందుకు బీఆర్‌ఎస్ నాయకులు యత్నిస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వడ్డె కృష్ణ అన్నారు. రైతులకు నిరంతరంగా 24 గంటల విద్యుత్‌ను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిన్నారంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ రమేశ్, నాయకులు సత్యనారాయణ, రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.
పటాన్‌చెరు టౌన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ నాయకులు పటాన్‌చెరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.
హత్నూర(సంగారెడ్డి): రైతులకు 24 గంటల విద్యుత్‌ను అందించడం లేదని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. టీపీసీసీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శ హకీమ్, సర్పంచ్ కొన్యాల వెంకటేష్, నర్సాపూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రియాజ్ అలీ, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుజాతసత్యం, నాయకులు పాల్గొన్నారు.
నారాయణఖేడ్: టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఖేడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తాహెర్ అలీ, నాయకులు నెహ్రూనాయక్, సాయిలు, శివకుమార్, రశీద్ పాల్గొన్నారు.


జిన్నారం: విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


నారాయణఖేడ్: విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మనూరు(నారాయణఖేడ్): మనూరు, నాగల్‌గిద్ద మండల పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఎదుట కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు సుభాష్‌రావు పాటిల్, నాగల్‌గిద్ద మండల అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, నాయకులు పాల్గొన్నారు.
రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెల్లాపూర్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించడం బాధాకరమన్నారు.



వైభవంగా బోనాల పండగ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో నిర్వహించిన బోనాల పండగలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ వైన్నవరం భూపాల్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని మాజీ ఎంపీటీసీ నరసింహ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, అమీన్‌పూర్ ఎంపీపీ దేవానంద్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.
నారాయణఖేడ్: మండలంలోని పోతన్‌పల్లి (ఆర్) గ్రామంలో నల్లపోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్‌తో కలిసి సర్పంచ్ లావణ్యకృష్ణ ప్రారంభించారు.
సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెల్టూర్ గ్రామంలో దుర్గమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పబ్బతి లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నవీన్, నాయకులు పాల్గొన్నారు.

సాయిపేట చెరువులో మొసలి


చెరువు గట్టుపై మొసలి

వట్‌పల్లి(అందోల్): సాయిపేట పెద్ద చెరువులో ఓ మొసలి కలకలం రేపింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..పెద్ద చెరువలోకి ఓ మొసలి వచ్చినట్లు అటువైపుగా వెళ్లిన కొందరు వ్యక్తులు గుర్తించారు. చెరువు గట్టుపైకి పడుకొని ఉండగా వారి మాటల శబ్దానికి మళ్లీ మెల్లగా చెరువలోకి జారుకుందన్నారు. దీంతో వారు గ్రామంలోకి వెళ్లి మొసలి చెరువులో సంచరిస్తుందన్న సమాచారాన్ని గ్రామస్తులకు చేరవేశారు. దీంతో పొలాలకు, చెరువువైపునకు వెళ్లే రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో అటవీ శాఖ అధికారులు మొసలిని అదుపులోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సదాశివపేట(సంగారెడ్డి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం సదాశివపేటలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో సదాశివపేట మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చింతా ప్రభాకర్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ బృందం రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కృపాకుమార్, వైస్ చైర్మన్‌గా శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్లుగా కుమార్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, కరుణాకర్, విద్యాసాగర్ ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాల్, ఎంపీపీలు మనోజ్‌రెడ్డి, యాదమ్మ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు రత్నాకర్డ్డి పవన్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఇంగ్లీష్ మీడియం తరగతులు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు సంబంధించి ఇంగ్లీష్ మీడియం తరగతులను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు గుండు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం సిర్గాపూర్ మండలంలోని సుల్తానాబాద్‌లో పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఆగస్టు 12న నిర్వహించే సంకల్ప రథయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మున్నూరు అంజన్న, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినయ్‌కుమార్, నర్సింగ్, ధర్మేంద్ర పాల్గొన్నారు.

◆ కేజీ టు పీజీ ఉచిత విద్య అందించాలి

జహీరాబాద్ టౌన్: కేజీ టూ పీజీ వరకు ఉచితవిద్య అందించాలని ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జహీరాబాద్‌లో విద్యాసంస్థలు బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూళ్లు స్వచ్ఛందగా పాఠశాలలకు సెలవులు ప్రకటించగా ప్రభుత్వ బడులను బంద్ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి రాజేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నర్సింహరెడ్డి, నాయకులు విష్ణువర్ధన్, హరీష్ దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

◆ జీపీ కార్మికుల సమ్మెకు సీపీఎం మద్దతు

కొండాపూర్(సంగారెడ్డి): మండల కేంద్రంలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారానికి 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మెకు సీపీఎం, రైతుసంఘం నాయకులు మద్దతు ప్రకటించారు. అనంతరం నాయకులు రాజయ్య, నరసింహారెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులను 11వ పీఆర్సీ ప్రకారం రూ.19,500 వేతనం అమలు చేసి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీపీ కార్మికులు సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు బాబురావు, కొండాపూర్ మండల అధ్యక్షులు, వెంకయ్య, ఉపాధ్యక్షులు, సంజీవులు, శ్రీనివాస్, సహాయ కార్యదర్శి అనంతయ్య, నాగరాజ్, సుశీల, బిక్షపతి, పాల్గొన్నారు.

◆ ఎంపీ బీబీ పాటిల్‌కు వినతిపత్రం అందజేత

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మండల పరిధిలోని మేదపల్లి సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్‌పాటిల్ బుధవారం ఎంపీ బీబీ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.

◆ ఆర్డీఓ కార్యాలయం ముట్టడి

జహీరాబాద్ టౌన్: పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం సీఐటీయూ నాయకులతో కలిసి ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నాయకురాలు సువర్ణ మాట్లాడుతూ బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కార్మికులు వంటలు వండలేకపోతున్నారని, తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు, పెంచిన వేతనాలను చెల్లించాలని కోరారు. సీఐటీయూ నాయకులు మహిపాల్, యూనియన్ నాయకులు పుష్ప,నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు షూ పంపిణీ

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని మల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ సొంతడబ్బులతో విద్యార్థులకు బుధవారం షూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శివలీల పాల్గొన్నారు.

◆ మౌనదీక్షలో సంజీవరెడ్డి

నారాయణఖేడ్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాధీపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కుట్రపూరిత వైఖరిని నిరసిస్తూ హైదరాబాద్ గాంధీభవన్ ఎదుట బుధవారం నిర్వహించిన సత్యాగ్రహ మౌనదీక్షలో ఖేడ్‌కు చెందిన టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

◆ ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడగింపు

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల గడువును జులై, 12 నుంచి 31 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్సీ ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులు ఈ నెల 31 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను http://iti.telanga na.gov.in వెబ్సైట్లో పొందవచ్చని సూచించారు.

◆ 16న ఆరెల్లిమైసమ్మ బోనాలు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డుకు సంబంధించి మంగల్‌పేట్‌లో ఈనెల 16న ఆరెల్లి మైసమ్మ బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వార్డు కౌన్సిలర్ స్వప్నఅభిషేక్ షెట్కార్ తెలిపారు.

◆ ఆరోగ్యమే మహాభాగ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని మయూరినగర్ కాలనీలో రిటైర్డ్ ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శంకరంగౌడ్, నాయకులు నాగభూషణం, రాములు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన డి.ధ్రువకుమార్ రెడ్డి, S/o. లేట్ డి.పుల్లారెడ్డి, ఫ్లాట్ నెం. 101, ప్లాట్ నెం.HIG 227, సూర్య క్యాటిల్, 6వ ఫేస్, KPHB కాలనీ, హైదరాబాద్, సెల్: 9963576664 గారు క్రింద తెలిపిన షెడ్యులు ప్రాపర్టీని చింతపర్తి నాగ సిద్ధమ్మ, W/o. ఓబుల్ రెడ్డి, ఇంటి నెంబర్ 2-638, ఆనంద నగర్, పెద్దపల్లి రోడ్డు, వైయస్సార్ కడప జిల్లా, గారి నుండి విక్రయము పొందుటకు నిర్ణయము చేసుకున్నారు. ఈ విక్రయము పైన ఎవరికైనా ఎలాంటి అభ్యంతరం ఉన్న ఒక వారం లోపు క్రింద అడ్రస్‌కి కానీ లేదా విక్రయించు దారుకు కానీ తెలియజేయగలరు.

షెడ్యూలు ఆస్తి

తెలంగాణ, సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్ మునిసిపాలిటీ మరియు మండలం, చక్రపురి కాలనీ, సర్వే నెం.126, యల్‌పి నెం. 3814/85 నందు 325 చ॥గ॥ విస్తీర్ణము గల ఫ్లాట్ నెం.660. మరియు హద్దులు: తూర్పు: 33 అ॥ వెడల్పుగల రోడ్డు, పడమర: పొరుగువారి స్థలము, ఉత్తరం: ఫ్లాట్ నెం.659, దక్షిణం: ఫ్లాట్ నెం.661.

ఇట్లు: ఎ.ప్రభాకర రెడ్డి, అడ్వకేట్ ఫ్లాట్ నెం.303, 3వ అంతస్థు, హెచ్.నెం.43-192-సి, యస్.ఆర్.పేట, కర్నూలు. సెల్: 9440072513

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400